జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
మంగళవారం, ఆగస్టు 4, 2026 పేజీలు: 8

నాణ్యమైన గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు అన్ని శాఖలు

## సమన్వయంతో పనిచేయాలి

### మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




**మహబూబ్‌నగర్, ఆగస్టు 3 ( ప్రజా జ్యోతి బ్యూరో )** గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు నాణ్యతతో రూపొందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆటోమేటిక్ స్కోరింగ్, గ్రేడింగ్ విధానంలో జిల్లా అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలను రూపొందించాలని సూచించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్--2026ను విజయవంతంగా అమలు చేయడం ప్రతి శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామ, మండల, జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు.గ్రామాభివృద్ధి ప్రణాళికలు 16వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరులు, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల సమన్వయంతో రూపొందించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, కమ్యూనిటీ

బాధితుల ఫిర్యాదులను

## సత్వరమే పరిష్కరించాలి

### గద్వాల జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు



**గద్వాల,ఆగస్టు 3(ప్రజా జ్యోతి ప్రతినిధి):** బాధితుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించి,వారి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా ఎస్పీ దృష్టికి

## జిల్లా ఆసుపత్రిలో ఓపి సేవలకు రద్దీ

- ఇబ్బందులు పడుతున్న రోగులు
- ఆసుపత్రి ఆవరణలో ప్రైవేట్ వాహనాలు
- పట్టించుకొని ఆసుపత్రి అధికారులు



ఓటరు జాబిత రూపకల్పనలో

## పారదర్శకతకి ప్రాధాన్యం

- డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి డబుల్ ఎంట్రీలకు తావివ్వొద్దు
- జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్ ఆగస్టు 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, డిజిటలైజేషన్ పనుల పురోగతి, ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ అమలుపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్దేశించిన గడువులోగా పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ..., ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో ఓటరు పేరు నమోదు, పేర్ల తొలగింపు, వివరాల సవరణ, చిరునామా మార్పు, లింగం, వయస్సు, ఇతర వ్యక్తిగత వివరాల్లో మార్పులకు

సమష్టి కృషితోనే జిల్లా

## అభివృద్ధి సాధ్యం

### గద్వాల కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల,ఆగస్టు 3(ప్రజా జ్యోతి ప్రతినిధి): సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా సమర్థవంతంగా అమలు చేస్తూ,జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పలువురు జిల్లా అధికారులు,కలెక్టరేట్

### సమష్టి కృషితోనే జిల్లా

# అభివృద్ధి సాధ్యం

సిబ్బంది ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేక్ కట్ చేయగా,అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ,జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ కృషి ప్రశంసనీయమని అన్నారు.ముఖ్యంగా అక్షరాస్యత పెంపు కోసం చేపడుతున్న కార్యక్రమాలు ఫలితాలిస్తున్నాయని,ప్రభుత్వ కార్యాలయాలు,వైద్య,విద్యాసంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ సేవల నాణ్యతను మెరుగుపర్చేందుకు కలెక్టర్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు.జోగుళాంబ గద్వాల జిల్లాను పలు రంగాల్లో రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సహకారం అందిస్తామని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాసరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి,రాజ్ కుమార్,వివిధ శాఖల జిల్లా అధికారులు,తహసీల్దార్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

### బాధితుల ఫిర్యాదులను

# సత్వరమే పరిష్కరించాలి

తీసుకువచ్చారు. ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వెంటనే సిబ్బందిని కేటాయించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ గ్రీవెన్స్ డేలో మొత్తం 25 ఫిర్యాదులు అందాయి.వీటిలో పొలాలకు సంబంధించినవి 12,గొడవలకు సంబంధించినవి 3,కుటుంబ సమస్యలకు సంబంధించినవి 5,పత్తి విక్రయించి డబ్బులు చెల్లించలేదన్న ఫిర్యాదు ఒకటి,అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదన్న ఫిర్యాదు ఒకటి,ఇతర అంశాలకు సంబంధించినవి 3 ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు,సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి,వారి వినతులను స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.దీంతో పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకం,భరోసా మరింత పెరుగుతుందన్నారు.గ్రీవెన్స్ డేలో అందిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

# జిల్లా ఆసుపత్రిలో ఓపి సేవలకు రద్దీ

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 03 – ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి సేవలు కోసం సోమవారం భారీగా జనం తరలివచ్చారు.సరిపడా కౌంటర్లు లేకపోవడంతో రోగురు గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. ఎక్కువసేపు నిలబడలేక కొందరు రోగులు వెనుదిరినట్లు తెలిపారు.ఓపి కౌంటర్ల సంఖ్య పెంచాలని ప్రజలు కోరుతున్నారు.ఇదిలా ఉండగా ఆసుపత్రి ఆవరణలో విచ్చలవిడిగా ప్రైవేట్ వాహనాలు,ఆటోలు గంటల తరబడి పార్కింగ్ చేయడంతో ప్రజ లు అనేక ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా ఆసుపత్రి అధికారులు స్పందించి ఆసుపత్రిలో ఓపి కౌంటర్లు ఏర్పాటు చేసి ఆసుపత్రి ఆవరణలో ప్రైవేట్ వాహనాలపై చర్యలు చెపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# నాణ్యమైన గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

ఆర్గనైజర్లు, అన్ని శాఖల అధికారులు ఈ ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావాలని కోరారు.జిల్లా, మండల స్థాయిలో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు పూర్తయ్యాయని, ఇక గ్రామసభల ద్వారా గ్రామాభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి ప్రాధాన్యతలను ప్రణాళికల్లో ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్య, వైద్యం, మహిళా––శిశు సంక్షేమం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలు, నిధులు, చేపట్టే కార్యక్రమాల వివరాలను డేటా కలెక్షన్ ఫార్మాట్ల ద్వారా గ్రామ, మండల స్థాయి అధికారులకు అందించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు గ్రామసభలు, మండలసభల్లో తప్పనిసరిగా పాల్గొని నాణ్యమైన ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని సూచించారు.

ఈసారి గ్రామాభివృద్ధి ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటిక్ స్కోరింగ్, గ్రేడింగ్ విధానం అమల్లో ఉంటుందని, గ్రామ పంచాయతీల ప్రణాళికలు ఆన్‌లైన్‌లో ఏ, బి, సి, డి గ్రేడ్లుగా మూల్యాంకనం చేయబడతాయని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల పథకాలు, నిధులు, కార్యకలాపాలు సమగ్రంగా ప్రణాళికల్లో పొందుపరిస్తేనే అత్యుత్తమ గ్రేడ్ సాధించవచ్చని స్పష్టం చేశారు.

శాఖల వారీగా అమలు చేస్తున్న పథకాల నిర్వహణ, నిధుల విడుదల, చెల్లింపులు, అమలు విధానంలో ఎలాంటి మార్పు ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలో అన్ని శాఖల సమాచారాన్ని సమగ్రంగా పొందుపరచడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అన్ని స్థాయి అధికారులకు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, డీఆర్వో నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, జడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీవో వెంకటరెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అమెరికాలో పాలమూరు ఎన్ ఆర్ ఐ ఫోరం మీట్ అండ్ గ్రీట్..

- మాజీ మంత్రులకు ఘన స్వాగతం
- తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు రావాలని పిలుపు




**మహబూబ్నగర్ ఆగస్టు 3 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

అమెరికాలో పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన "మీట్ ఉ గ్రీట్" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, డా. సి. లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్. రాజేందర్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు టి. రామచంద్ర రెడ్డిని మాజీ మంత్రులు, నాయకులు ఘనంగా సన్మానించి, ప్రవాస భారతీయుల సేవలను అభినందించారు. సభలో మాట్లాడిన నాయకులు, బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం మౌలిక సదుపాయాలు, సాగునీరు, పారిశ్రామిక రంగం, సంక్షేమ పథకాల అమలులో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే స్థాయిలో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు.

అమెరికాలో స్థిరపడిన తెలంగాణ ప్రవాసులు స్వరాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పరిశ్రమలు, విద్యా, ఆరోగ్య సంస్థలు స్థాపించడం ద్వారా స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమం ప్రవాస పాలమూరు వాసులు, తెలంగాణ నాయకుల మధ్య ఆత్మీయ అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాస భారతీయుల భాగస్వామ్యంపై సానుకూల చర్చలకు వేదికగా నిలిచింది.

### ఓటరు జాబిత రూపకల్పనలో

# పారదర్శకతకి ప్రాధాన్యం

సంబంధించిన దరఖాస్తులను అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) చేపడుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి డబుల్ ఎంట్రీలు, నకిలీ నమోదులు, సాంకేతిక లోపాలు లేదా సమాచారం నమోదు చేసే సమయంలో పొరపాట్లు జరగకుండా అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా మాత్రమే నమోదు చేయాలని స్పష్టం చేశారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపడుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రజలు ఎన్నికల సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు అందించే సేవలను సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితాలను పూర్తిస్థాయిలో తప్పులులేకుండా రూపొందించేందుకు సహకరించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలుచేపడుతున్నామనిరాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇప్పటికే సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో గుర్తించిన ఎస్‌డీ అన్‌మ్యాపింగ్ ఎర్రర్ ఎంట్రీలకు సంబంధించిన ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి, అవసరమైన సూచనలు, అభ్యంతరాలు తెలియజేయాలని కోరినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల సహకారంతో పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా…రూపొందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అందిన ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి, అవసరమైతే విచారణ నిర్వహించి పారదర్శకంగా నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ చెన్నయ్య, నాగర్ కర్నూల్ ఆర్డిఓ అర్చన, కొల్లాపూర్ ఆర్డీవో, బన్సీలాల్, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, డిటి కల్పన, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయకు వ్యాధికి చెక్!

### -గ్రామాల్లో క్షయ వ్యాధిపై ఇంటింటా సర్వే

**నాగర్ కర్నూల్ : ఆగస్టు 03 (ప్రజాజ్యోతి)**

క్షయ వ్యాధిని రూపుమాపేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో ఇంటింటి సర్వేను ప్రతిస్టాత్మకంగా చే పట్టింది.అందులో భాగంగానే సోమవారం నాగర్ కర్నూల్ మండల పరిధిలోని శ్రీపూర్,బొందనపల్లి గ్రామాల్లో ప్రత్యేక క్షయ వ్యాధి గుర్తింపు శిబిరాలు నిర్వహించింది.ప్రారంభ దశలోనే టీబి ని గుర్తించి చికిత్స అందించడమే లక్ష్యమని వైద్య సిబ్బంది తెలిపారు.వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే జిల్లా ఆసుపత్రిని సంప్రదించాలని సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమాన్ని భవిష్య భారత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.



## క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు: సర్పంచ్ మాణిక్యమ్మ

**మహమ్మదాబాద్, ఆగస్టు 3: ( ప్రజా జ్యోతి) :**

క్రీడల్లో రాణిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గాదిర్యాల్ గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ అన్నారు. సోమవారం గాదిర్యాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన గ్రామ యువకులకు సర్పంచ్ మాణిక్యమ్మ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామానికి చెందిన వాలీబాల్ జట్టు జిల్లా స్థాయిలో రాణించడం గ్రామానికి గర్వకారణమని అన్నారు. క్రీడాకారులు ఇదే పట్టుదలతో సాధన కొనసాగించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధించి గ్రామానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.యువత క్రీడలను కెరీర్‌గా మలుచుకునే అవకాశాలు నేడు విస్తృతంగా ఉన్నాయని పేర్కొంటూ, గ్రామపంచాయతీ తరఫున క్రీడాకారులకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ప్రధానోపాధ్యాయులు రాములు, గండేటి చంద్రయ్య, ఆముదాల చిన్నయ్య, ఇరవేంటి అంజలయ్య, యువజన సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# న్యాయవాది హత్య.. కోర్టు విధులకు బహిష్కరణ


- మల్లయ్య హత్యను ఖండించిన జూనియర్ అడ్వకేట్స్
- నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్
- న్యాయవాదులకు భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

**వనపర్తి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి):**
కొల్లాపూర్ బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది డా. బి. మల్లయ్య హత్యను జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తీవ్రంగా ఖండించింది. ఈ ఘటన కేవలం ఒక న్యాయవాదిపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తున్నామని సంఘం అధ్యక్షుడు నాసనల్లి రాజు సాగర్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయవాదులు నిర్భయంగా విధులు నిర్వహించే వాతావరణాన్ని దెబ్బతీసే ఇటువంటి ఘటనలు ఆందోళనకరమని తెలిపారు. ఈ నేపథ్యంలో వనపర్తి బార్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయానికి సంఘీభావం తెలుపుతూ, దివంగత న్యాయవాది డా. బి. మల్లయ్యకు నివాళులర్పిస్తూ సోమవారం కోర్టు విధులను బహిష్కరించే నిర్ణయానికి మద్దతు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ ఈ హత్య కేసును అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని నిష్పాక్షికంగా, వేగవంతంగా దర్యాప్తు జరిపి నిందితులందరినీ వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమర్థమైన భద్రతా వ్యవస్థను అమలు చేయాలని కోరారు.



## తండ్రి చేతుల మీదుగా సత్కారం.. పూర్వజన్మ సుకృతం!”

– రవీంద్రభారతి విద్వత్సభలో యువ పంచాంగకర్త ఓరుగంటి నాగరాజు శర్మకు ఘన సన్మానం



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి):**
తెలంగాణ విద్వత్సభ దశాబ్ది మహోత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక, పర్యాటక, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రెండు రోజుల పాటు విద్వత్ గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్వత్ సమ్మేళనంలో రాబోయే ప్లవంగ నామ సంవత్సరంలోని పండుగల నిర్ణయాలపై పండితులు విస్తృతంగా చర్చించి ఏకాభిప్రాయానికి వచ్చారు. అనంతరం ప్రముఖ పంచాంగకర్త, విద్వత్ సభ సంయుక్త కార్యదర్శి ఓరుగంటి మనోహర్ శర్మ సిద్ధాంతి, దైవజ్ఞాన సిద్ధాంతి చేతుల మీదుగా యువ పంచాంగకర్త ఓరుగంటి నాగరాజు శర్మ సిద్ధాంతిని ఘనంగా సత్కరించారు. తండ్రి చేతుల మీదుగా ఈ సత్కారం అందుకోవడం తనకు పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని నాగరాజు శర్మ సిద్ధాంతి ఆనందం వ్యక్తం చేశారు.

# ట్రాన్స్ ఫార్మర్ నుంచి కాపర్ వైర్ చోరీ ఘటన స్థలాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు

**రైతుల కోసం ఆందోళనకు సిద్ధం:**
**బీజేపీ రాష్ట్ర నాయకులు కురువ చిన్న మల్లయ్య**
**20 రోజులైనా పట్టించుకోరా?**
**పేస్-2పై పాలకుల నిర్లక్ష్యం**
**నీళ్లు ఉన్నా.. ఎత్తిపోయలేని దుస్థితి!**





**చిన్నంబావి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి)**
చిన్నంబావి మండల కేంద్రంలోని పెద్దమారూర్ గ్రామ సమీపంలో ఉన్న చిన్నమారూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పేస్--2 పంప్‌హౌస్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తుతెలియని దుండగులు కాపర్ వైర్లను చోరీ చేసిన ఘటనపై బీజేపీ నాయకులు మరోసారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీ జరిగి సుమారు 20 రోజులు గడుస్తున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర బీజేపీ నాయకులు కురువ చిన్న మల్లయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెదర్లాండ్ ప్రభుత్వం మంచి ఉద్దేశంతో నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ఇక్కడ అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్‌ను కిందికి వదిలి కాపర్ వైర్లను చోరీ చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీసీ కెమెరాల నిర్వహణపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తూ, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలుగులోకి తేవాలని కోరారు.కృష్ణా నదిలో నీరు అందుబాటులోకి వచ్చినప్పటికీ పేస్--2 పంప్‌హౌస్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో రైతులకు సాగునీరు అందించే పరిస్థితి లేదన్నారు. కాల్వల మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో లిఫ్ట్ ద్వారా నీటిని ఎక్కడికి తరలిస్తారని ప్రశ్నించారు. ఎలినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, బోర్లు సైతం ఎండిపోతున్నాయని తెలిపారు. లిఫ్ట్ పథకాన్ని పునరుద్ధరిస్తే రైతులకు సాగునీటితో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందన్నారు.వారం రోజుల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోతే చిన్నంబావి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించడంతో పాటు రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని రాష్ట్ర బిజెపి నాయకులు కురువ చిన్న మల్లయ్య హెచ్చరించారు.నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. చోరీ ఘటన జరిగిన రోజే అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేయించి చిన్నంబావి మండల రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. వర్షాలు సరిగా కురవకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో కృష్ణా నదికి నీరు రావడం ఆశ కలిగించిందని, అయితే పేస్--2లో ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో ఆ నీటిని వినియోగించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు.ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ భద్రత కోసం కంచె ఏర్పాటు చేసి, భవిష్యత్తులో ఇలాంటి చోరీలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లిఫ్ట్ పథకం, కాల్వల అభివృద్ధిపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.
బీజేపీ మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య మాట్లాడుతూ.. ఘటన జరిగిన వెంటనే అధికారులతో పాటు రాజకీయ నాయకులు, మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఇది రెండోసారి సంఘటనా స్థలాన్ని పరిశీలించడం జరుగుతోందని తెలిపారు. మండలంలో వర్షపాతం తక్కువగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, లిఫ్ట్ పథకాన్ని త్వరగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బీజేపీ మండల జనరల్ సెక్రెటరీ సంపత్ కుమార్, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీకి పాల్పడిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే మండలవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి నాయకులు కురువ చిన్న మల్లయ్య, నాగర్ కర్నూల్ జిల్లా జనరల్ సెక్రెటరీ జగ్గారి శ్రీధర్ రెడ్డి, చిన్నంబావి మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, గూడెం సర్పంచ్ కొత్త వెంకట్ రెడ్డి, ఓబీసీ ఉపాధ్యక్షులు మేకల చెన్నయ్య, యాదవ్ మండల ఉపాధ్యక్షులు గణేష్ రెడ్డి, మద్దిలేటి యాదవ్, డి ఎన్ రాము ఉమేష్ చంద్ర బిజెపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు

## పీఎం శ్రీ జడ్పీహెచ్‌ఎస్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు




**మల్దకల్,ఆగస్టు 3(ప్రజా జ్యోతి):**
జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలో 216 మంది నూతన విద్యార్థులు చేరగా,మొత్తం విద్యార్థుల నమోదు 726కు చేరుకుంది.ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 60 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం పొందడం విశేషమని పాఠశాల యాజమాన్యం తెలిపింది.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు,విద్యార్థులు నూతన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జి.సురేష్ మాట్లాడుతూ,పీఎం శ్రీ పథకం ద్వారా నాణ్యమైన విద్యతో పాటు డిజిటల్ తరగతులు,ఆధునిక మౌలిక సదుపాయాలు, క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ,విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పాటలు,నృత్యాలు,ఆటలు,వినోదాత్మక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కొత్తగా చేరిన విద్యార్థులు పాఠశాలలో లభించిన ఆత్మీయ స్వాగతంపై హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.సురేష్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు



## రాయితీ ధరకు పప్పుధాన్యాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

**గద్వాల,ఆగస్టు 3(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
ఆత్మనిర్భర్ పథకం కింద పప్పుధాన్యాల విత్తనాలను రాయితీ ధరపై జిల్లాలోని అన్ని మండల వ్యవసాయ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ,కందులలో పీఆర్‌జీ-176, డబ్ల్యూఆర్‌జీ-93,ఎల్‌ఆర్‌జీ-52,ఆశా (ఐ సి పి ఎల్-87119) రకాల విత్తనాలు,అలాగే మినుములలో వీబీఎన్-8,వీబీఎన్-10రకాల విత్తనాలు మండల వ్యవసాయ కార్యాలయాల్లో రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.ఈ విత్తనాలను వినియోగించుకోవడం ద్వారా ప్రతికూల వాతావరణ పరిస్థితులను,ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొంటూ మెరుగైన దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమీప మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి రాయితీ ధరపై విత్తనాలను పొందాలని ఆయన సూచించారు.



# నాణ్యమైన విద్యే ప్రభుత్వ ధ్యేయం

## – అభివృద్ధి పనులతో శ్రీరంగాపురంలో శ్రీకారం
## – మహిళా సాధికారత.. డిజిటల్ విద్యకు పెద్దపీట: ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి):** మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలో సోమవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మొదట రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ మహిళా సమాఖ్య భవనానికి, మరో రూ.10 లక్షలతో నిర్మించనున్న మండల మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న గోదాం భవనానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రూ.14.50 లక్షలతో ఏర్పాటు చేసిన పీఎం శ్రీ కంప్యూటర్ ల్యాబ్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పిస్తూ డిజిటల్ విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా సమాఖ్యలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయడం ద్వారా సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను




నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మద్దిలేటి, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీహరి రాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

## జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, ఆగస్టు 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా హామీ ఇచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులు, ఆయిల్ పామ్ రైతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె ఈ హామీ ఇచ్చారు.సమావేశంలో రైతులు వినతిపత్రం సమర్పిస్తూ, ఆయిల్ పామ్ తోటల మీదుగా వెళ్తున్న హైటెన్షన్, లోటెన్షన్ విద్యుత్ లైన్ల కారణంగా షార్ట్ సర్క్యూట్లు జరిగి అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే పండ్ల గెలలను కోసే కూలీల భద్రత కూడా ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.దీనిపై స్పందించిన కలెక్టర్, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు విద్యుత్ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 249 మంది రైతులకు చెందిన 1,090 ఎకరాల ఆయిల్ పామ్ తోటలు విద్యుత్ లైన్ల సమస్యతో ప్రభావితమవుతున్నట్లు అధికారులు సమావేశంలో వివరించారు. రైతులు ఏడాది పొడవునా యూరియా ఎరువులు అందుబాటులో ఉంచాలని, స్లాషర్లు, మల్చర్లు వంటి వ్యవసాయ యంత్రాలను పెద్ద ఎత్తున అందించాలని కోరారు. అడవి పందుల నుంచి లేత ఆయిల్ పామ్ తోటలను రక్షించేందుకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



అలాగే అండర్‌గ్రౌండ్ డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రస్తుతం అమలులో ఉన్న 12.5 ఎకరాల పరిమితిని తొలగించాలని, కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద వ్యవసాయ పనులకు కూలీలను అందుబాటులో ఉంచాలని కోరారు. తక్కువ నీరు ఇస్తున్న బోరుబావులు ఉన్న రైతులకు నీటి నిల్వ కోసం లైనింగ్‌తో కూడిన ఫార్మ్ పాండ్లను అధిక సంఖ్యలో మంజూరు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను ఓర్పుగా విన్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా స్థాయిలో పరిష్కరించగల అంశాలపై వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విధానపరమైన అంశాలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా కృషి చేస్తుందని తెలిపారు.
ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె. వేణుగోపాల్, విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ చక్రవర్తి, ఫ్రీ యూనిక్ ఆయిల్ పామ్ కంపెనీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్‌రావు, ఉద్యానవన శాఖ అధికారులు, ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారు.

## అఖండ భజన సప్తాహ కరపత్రం ఆవిష్కరణ

మల్దకల్,ఆగస్టు 3(ప్రజా జ్యోతి):జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్దకల్ మండల కేంద్రంలోని శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 8 నుంచి 15 వరకు నిర్వహించనున్న అఖండ జ్యోతి సప్తాహ భజన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ,సకాలంలో వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించాలని,రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని,గద్వాల జిల్లా సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ అఖండ జ్యోతి సప్తాహ భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సప్తాహ భజన కార్యక్రమాన్ని విజయవంతం చేసి స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ ప్రహ్లాదరావు,సర్పంచ్ చిట్టెమ్మ, హార్మోనిస్ట్ పచ్చర్ల రాఘవేంద్రాచారి,ప్రసాదాచారి,చంద్రశేఖర్ రావు,నాయకులు వెంకటన్న,కొంకటి నరేందర్,మధునాయకి,తిమ్మరాజు,పరుశరాముడు,నాగరాజు, ఉప్పరి నారాయణ,నర్సింహులు,ప్రవీణ్,తిమ్మప్ప,బాదం శ్రీనివాసులు,మనసాని నాగరాజు,రాజు,కృష్ణమూర్తి,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు

**మల్దకల్,ఆగస్టు 3(ప్రజా జ్యోతి):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాన్ని పురస్కరించుకుని మల్దకల్ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ,తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని,శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు ఇవ్వడం ప్రారంభించాలని సూచించారు.మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించాలని,అనంతరం తల్లిపాలతో పాటు అదనపు పోషకాహారం అందించాలని తెలిపారు.తల్లిపాలు శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచి,పోషకాహార లోపాన్ని నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.గర్భిణీలు,బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవాలని,తల్లిపాలపై ఉన్న అపోహలను నమ్మకుండా శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది,ఆశా కార్యకర్తలు,అంగన్‌వాడీ సిబ్బంది,గర్భిణీలు,బాలింతలు పాల్గొన్నారు.

## మల్దకల్ పీఎం శ్రీ పాఠశాలలో ఘనంగా వీడ్కోలు,స్వాగత కార్యక్రమం



**మల్దకల్,ఆగస్టు 3(ప్రజా జ్యోతి):** జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్ విజయ్,వాచ్‌మెన్ రమణయ్యలకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.అదే సందర్భంగా నూతన రికార్డు అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయ్ భాస్కర్ రెడ్డికి పాఠశాల కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ,వాచ్‌మెన్ రమణయ్య దాదాపు 30 సంవత్సరాల పాటు నిబద్ధతతో విధులు నిర్వహించి పాఠశాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అలాగే రికార్డు అసిస్టెంట్ విజయ్ గత పదేళ్లుగా సమర్థవంతంగా సేవలందిస్తూ పాఠశాల పరిపాలనలో విశేష కృషి చేశారని ప్రశంసించారు.అనంతరం రమణయ్య,విజయ్‌లను శాలువాలు కప్పి,పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు.వారి పదవీ విరమణ అనంతర జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.తదుపరి నూతన రికార్డు అసిస్టెంట్ విజయ్ భాస్కర్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.సురేష్, ఉపాధ్యాయులు,బోధనేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొని వీడ్కోలు పొందిన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు నూతన రికార్డు అసిస్టెంట్‌కు అభినందనలు తెలిపారు.

## రైతు వేదికలో సబ్సిడీపై మినుముల విత్తనాలు



**వంగూరు ఆగస్టు 3 (ప్రజా జ్యోతి)** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలంలో రైతు వేదికలో ప్రభుత్వ రాయితీపై మినుముల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల విస్తరణ అధికారి ప్రియదర్శిని పేర్కొన్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా మినుముల విత్తనాలుజాతీయ విత్తన సంస్థ (చీఖ్‌అశీఖ్రీ ాववసం జశీతీజూశీతీఖ్‌అశీఅ - చీూజ)లి ద్వారా లిరాయితీపై మినుముల (దీశ్రీఖషెని +తీఖఎ) విత్తనాలులి వంగూరు మండల కేంద్రం లో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్యాకెట్ 4 కేజీలు, పూర్తి ధర - ?528 కాగా, ప్రభుత్వ రాయితీ - ?120 ఇవ్వబడుతుంది. దీంతో రైతులు ఒక్కో ప్యాకెట్‌ను - ?408 మాత్రమే చెల్లించి పొందవచ్చు.ఆసక్తి గల రైతులు, తమ యొక్క పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తమ సంబంధిత లివ్యవసాయ విస్తరణాధికారులను (ూజూం)లి లేదా లిమండల వ్యవసాయ కార్యాలయం(రైతు వేదిక) వంగూరులిను సంప్రదించి విత్తనాలను పొందగలరు. మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

# ఎస్సీ వర్గీకరణతో మాలల ఉనికికే ముప్పు

**-ఎస్సి వర్గీకరణతొ దళితులపై రాజకీయ కుట్ర**
**-మాలలను నమ్మించి గొంతు కోసిన తెలంగాణ సర్కార్**
**-చట్టం చేసేవరకు పోరాటం కొనసాగుతుంది**
**-రాక్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్.రత్నాకర్**

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 03 (ప్రజా జ్యోతి)**



ఎస్సి వర్గీకరణ పేరుతొ మాలలను కాంగ్రెస్ సర్కార్ నమ్మించి గొంతు కోసిందని మాలమహానాడు ఉరాక్స్ నేషనల్ అధ్యక్షుడు డా. ఆర్.ఎస్.రత్నాకర్ అన్నారు.సోమవారం నాగర్కర్నూల్ పట్టణంలోని హిమాలయ కాన్వెన్షన్ హాల్లో బిలేఖరుల సమావేశాన్ని నిర్వహించి ఎస్సి వర్గీకరణ పేరుతొ దళితులపై జరుగుతున్న రాజకీయ కుట్రలను కాంగ్రెస్,బి జె పి,టి డి పి ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణతో మాల సామాజికవర్గం పూర్తిగా ఉనికి కోల్పోఇందని,ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులపై దేశ వ్యాప్తంగా రాజకీయ కుట్ర జరుగుతుందని, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్లో చట్టం చేసేంతవరకు నిరంతరం శాంతియుత పోరాటం కొనసాగుతుందన్నారు.ఎస్సీ వర్గీకరణను ఉదాహరణగా దేశం మొత్తంలో పంజాబ్,హర్యాన రాష్ట్రాలలో మొట్ట మొదటిగా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేఅని,వర్గీకరణకు బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే దీన్ని నరేంద్ర మోడీ దేశం మొత్తానికి చేశాడని,నిజానికి ఎస్సీ రిజర్వేషన్ వల్ల వందలోఒకరిద్దరికి మాత్రమే లాభం చేకూరుతుందని అదికూడా అధికారికలెక్క కాదని వందలో యిద్దరికి ఇచ్చే ఫలాలు సమన్యాయం,సామాజిక న్యాయం పేరుతో దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1,108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారో నరేంద్ర మోడీ చెప్పాలని, ఈ రెండు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు,రేవంత్ రెడ్డిలు ఎలా పంచుతారని ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా,సామాజిక న్యాయం దళితులకిచ్చే రిజర్వేషన్లలోనేనా,దేశ సంపదలో అక్కర్లేదా,మోడీ,చంద్రబాబు,రేవంత్ రెడ్డి క్యాబినెట్లోని మంత్రి పదవుల విషయంలో సామాజిక న్యాయం అక్కర్లేదా,మాలవర్గంపై కుట్ర చేస్తుంటే ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయాయని ఇక చేసేదేముంది అనుకోకూడదని ప్రజలు తలచుకుంటే ఏ చట్టాలనైనా ప్రభుత్వాలు ప్రజా స్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందేనని తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తూ ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం ఘోర అన్యాయమని,చంచాగిరికి అలవాటుపడ్డ మాల రాజకీయ నాయకులు రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారు తప్ప జాతి పట్ల విశ్వాసంగా లేరనే విషయాన్ని అందరు గమనించాలని,తెలుగు రాష్ట్రాల్లో ఏనాడు ఎదుర్కోనటువంటి గడ్డు పరిస్థితిని నేడు మాల సామాజిక వర్గం ఎదుర్కొంటుందని, తెలుగు రాష్ట్రాలలో మాల కులం తన ఉనికిని కోల్పోతుందని శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్. చెన్నయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాదిమంది మాలల ఆందోళనను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని,ఎస్సీ వర్గీకరణ పేరుతొ మాలలకుఅన్యాయం జరుగుతున్నా అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని,ఎస్సీ వర్గాల్లోని ఉప కులాలకు న్యాయం జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని,ఎస్సీ వర్గీకరణతో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వ పరిశీలించాలన్నారు.ఈ సమావేశంలో డాక్టర్.చెన్నయ్య,బీరం సతీష్ కు మార్,కూన సుధాకర్,నూనె క్రాంతి కుమార్ లు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికై ప్రజావాణి

**- ప్రజావాణిలో 56 వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**




అర్జీలను సత్వరమే పరిష్కరించడానికి ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపేందుకు జిల్లా కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఈ వారం మొత్తం 56 వినతిపత్రాలు అందాయని ప్రజావాణి అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రజల నుంచి స్వయంగా దరఖాస్తులను స్వీకరించి, ఒక్కో అర్జీదారుడి సమస్యను ఓపికగా విని, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.నాగర్ కర్నూల్ జిల్లాలోని వివిధ మండలాల పరిధిలోని గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలు, సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ కు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా...బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్జీపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, అర్హత మేరకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం సహించబోమని హెచ్చరించారు. ప్రజావాణిలో అందిన అర్జీలపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించి, పెండింగ్ లేకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ సిబ్బందిని జిల్లా రెడ్ క్రాస్ సంస్థలో సభ్యత్వం నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవ సహాయం,డిఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావాణికి 10 వినతులు

**-చట్ట ప్రకారం పరిష్కరించాలి**
**-జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 03 : ప్రజా జ్యోతి**

పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమ వారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు దారుల నుండి 10 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్వీకరించి ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు.ఈ ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన 10 అర్జీలలో భూమికి సంబంధించినవి 7,తగు న్యాయం సంబంధించినవి 3 వినతులను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి పరిష్కారానికి సూచనలు చేయడం జరిగిందని,జిల్లా ప్రజలు నిర్భయంగా,మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి,పైరవీలులేకుండా నేరుగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రజల సమస్యలు చట్టప్రకారం పరిష్కరించెలా పోలీసులు ప్రజలకు దగ్గరయ్యేలా,శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలిపారు.



## తల్లిపాలే శిశువుకు అమృతం



**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

మండల పరిధిలోని గోపాల్ దీన్నే గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమృతమని పుట్టిన వెంటనే తల్లి పాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు అవసరమైన సంపూర్ణ పోషకాహారం వ్యాధి నిరోధక శక్తి లభిస్తాయని అన్నారు తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలనే అందించాలని అనంతరం పోషకాహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించడం వల్ల చిన్నారులు ఆరోగ్యంగా ఎదుగుతారని వివరించారు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి కుటుంబంలో అవగాహన పెంపొందించాలని ఆమె పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో యుపిఎస్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు గ్రామ కార్యదర్శి కరుణాకర్ అంగన్వాడి టీచర్ జానకి హెల్పర్ గంగా, గీతాంజలి, ఆశ వర్కర్లు బాలింతలు చిన్నారులు మరియు గ్రామస్తులు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు.

## బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ జీని కలిసిన గండీడ్ మండల నాయకులు



**హైదరాబాద్, ప్రజాజ్యోతి:**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ జీ గారిని గండీడ్ మండల బీజేపీ అధ్యక్షుడు కే. విజయ్ కుమార్ రెడ్డి, మండల కోశాధికారి కర్నే శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్, వనపర్తి జిల్లా ఇన్చార్జ్ గిరమౌని శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గండీడ్ మండలంలో పార్టీ సంస్థాగత బలోపేతం, సభ్యత్వ విస్తరణ, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపడుతున్న కార్యక్రమాలపై నాయకులు రాష్ట్ర సంఘటన మంత్రికి వివరించారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని చంద్రశేఖర్ జీ సూచించారు.రానున్న పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో గండీడ్ మండల కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గండీడ్ మండలంలో పార్టీ విస్తరణకు చేపడుతున్న కార్యక్రమాలను రాష్ట్ర నాయకత్వం అభినందించగా, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రజలతో కలిసి పనిచేస్తామని మండల నాయకులు తెలిపారు.

## మహబూబ్‌నగర్ డీసీసీబీ నూతన సీఈఓగా మహమ్మద్ షఫీఉల్లా ఖాన్ బాధ్యతల స్వీకరణ

**మహబూబ్‌నగర్, ఆగస్టు 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) నూతన ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ)గా మహమ్మద్ షఫీఉల్లా ఖాన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా నూతన సీఈఓకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లాలో సహకార బ్యాంకు సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజలకు అందించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధిలో సహకార రంగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, రైతులు, ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలని సూచించారు.



# మార్పు కోసం జనసేన పార్టీలో చేరిన రైతన్నలు

**-జనసేన పార్టీ సిద్ధాంతాలే ప్రజల్లో వస్తున్న కదలికలకు కారణం**
**-మార్పు కోసం జనసేన పార్టీని స్వాగతిస్తున్న ప్రజలు**
**- మఖ్తల్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ గౌడ్**



**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 03 (ప్రజా జ్యోతి):**
మఖ్తల్ నియోజకవర్గంలో జనసేన పార్టీకి ప్రజల మద్దతు రోజురోజుకు పెరుగుతుందని, పార్టీని బలోపేతం చేసేందుకు ప్రజలు రైతులు యువకులు స్వచ్ఛందంగా పార్టీలోకి చేరుతున్నందుకు సంతోషంగా ఉందని మఖ్తల్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ గౌడ్ అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ మండలంలోని దాదన్ పల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులు,యువకులు స్వచ్ఛందంగా పార్టీలోకి చేరేందుకు వచ్చిన వారికి డాక్టర్ మణికంఠ గౌడ్ జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వ్యక్తులు మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు నచ్చడంతో పాటు ఆయన చేస్తున్న సేవలు సనాతన ధర్మం కోసం, దేశం కోసం ఆయన వ్యవహరిస్తున్న తీరును చూసి ఈరోజు పార్టీలోకి చేరడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జనసేన పార్టీలో చేరిన వ్యక్తులను ఉద్దేశించి మఖ్తల్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ గౌడ్ మాట్లాడుతూ ఈరోజు చేరిన వారిలో వీర మహిళలు కూడా మేము చదువుకోకపోయినా పార్టీ కోసం మా వంతుగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేసేందుకుపనిచేస్తామని చెప్పడం చాలా గర్వంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ బలోపేతం చేసేందుకు యువత, విద్యావంతులను ఒక్కటే కాదు రైతులను కూడా రానున్న రోజుల్లో జనసేన పార్టీలో చేర్చుకొని ప్రత్యేక బాధితులు ఇవ్వనున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు రైతుల పట్ల ఉన్న ప్రేమను ఒక రైతుబిడ్డగా రైతులకు చేస్తున్న సేవలను డాక్టర్ మణికంఠ గౌడ్ రైతన్నలకు వివరించారు. అనంతరం జనసేన పార్టీ బలోపేతం కోసం పార్టీలోకి రైతన్నలు చేరిన సందర్భంగా పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత మన అందరిదీ అంటూ జనసేన పార్టీ కార్యకర్తలతో కలిసి డాక్టర్ మణికంఠ గౌడ్ మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ నాయకులు కె.రామన్ గౌడ్,గౌడి బాల్ రెడ్డి,శివ,కావలి ప్రవీణ్,కృష్ణ గౌడ్ నరేష్,గాలా మునివర్ధన్ రెడ్డి,ఆటో రాములు,గాల నర్సిములు,కుమ్మరి అంజన్న,బల్ల నర్సింహులు,ఎం ఆంజనేయులు,కుర్వ హనుమంతు గాల లింగారెడ్డి,గాల నరేష్ రెడ్డి,గాల సుజాత రెడ్డి, గాల అనిత,కుమ్మరి పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువు ఆరోగ్యానికి తొలి రక్షణ

**- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా**




మహబూబ్‌నగర్, ఆగస్టు 3( ప్రజా జ్యోతి బ్యూరో ): ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1--7) సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారం అని పేర్కొన్నారు. శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం అత్యంత అవసరమని, పుట్టినప్పటి నుంచి తొలి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే అందించాలని సూచించారు. అనంతరం తగిన పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించాలని తెలిపారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన అన్ని పోషకాలను అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంపొందించి అనేక అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని, తల్లి ఆరోగ్యానికీ అనేక ప్రయోజనాలు కలిగిస్తాయని కలెక్టర్ వివరించారు.ఈ ఏడాది ప్రపంచ తల్లిపాల వారోత్సవాల థీమ్ “తల్లిపాలకు ప్రాధాన్యత ఇద్దాం -- సుస్థిరమైన సహాయ వ్యవస్థలను ఏర్పాటు చేద్దాం” అనే సందేశాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి జరీన్ బేగం మాట్లాడుతూ, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులు తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించి శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలు ఇవ్వాలని, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే అందించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా సంక్షేమ అధికారి జరీన్ బేగం, వివిధ శాఖల జిల్లా అధికారులు, సీడీపీవోలు, జిల్లా సంక్షేమ శాఖ, డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రిష్ణ మండల బీజేవైఎం అధ్యక్షులుగా ఒట్టెవోల్లా సురేష్

**-మండలంలో పార్టీని బలోపేతం చేసినందుకు కృషి చేయాలి**
**-నారాయణపేట జిల్లా బీజేవైఎం అధ్యక్షులు భరత్**



**క్రిష్ణ మండలం ఆగస్టు 03 (ప్రజా జ్యోతి):**
క్రిష్ణ మండలంలోని పాఠశాలలో విద్యార్థులు సమస్యలను తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు బీజేవైఎం నూతన కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని నారాయణపేట జిల్లా బీజేవైఎం అధ్యక్షులు భరత్ అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ నియోజకవర్గంలోని క్రిష్ణ మండలంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భారతీయ జనతా పార్టీ క్రిష్ణ మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప మరియు నారాయణపేట జిల్లా బీజేవైఎం అధ్యక్షులు భరత్ ఆధ్వర్యంలో క్రిష్ణ మండల బీజేవైఎం అధ్యక్షులుగా ఒట్టెవోల్లా సురేష్ ఎన్నుకోవడం జరిగింది. అనంతరం నూతనంగా క్రిష్ణ మండల బీజేవైఎం అధ్యక్షులుగా ఎన్నికైన ఒట్టెవోల్లా సురేష్ ను ఘనంగా శాలువాతో సన్మానించారు. అనంతరం జిల్లా బీజేవైఎం అధ్యక్షులు భరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల మొండి వైఖరిని వీడి తక్షణమే ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన క్రిష్ణ కృష్ణ మండల బీజేవైఎం కమిటీ సభ్యులు మండలంలోని అన్ని పాఠశాలలను సందర్శించి పాఠశాలల్లో పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అంతేకాకుండా భారతీయ జనతా పార్టీ మండల నాయకులు నాయకత్వంలో కేంద్ర పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు సంస్థాగతంగా గ్రామ గ్రామాన యువకులను పార్టీలో చేర్పించి భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలన్నారు. అనంతరం నారాయణపేట జిల్లా బీజేవైఎం అధ్యక్షులుగా భరత్ ఎన్నికైన తర్వాత మొదటిసారి తమ మండలానికి విచ్చేసిన సందర్భంగా మండల కమిటీ ఆధ్వర్యంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా నాయకులు మంజునాథ్, వన్నవాడ శ్రీకాంత్,మండల ప్రదాన కార్యదర్శులు డి.రాఘవేంద్ర,సచిన్ బాట,సురేష్ బాత్,జల తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల జీవితాల్లో కొత్త ఆశలు

**- రూ.116 కోట్ల కేటాయింపును స్వాగతించిన జిల్లా నాయకులు**
**- మంత్రి వాకిటి శ్రీహరికి జిల్లా మత్స్యకారుల కృతజ్ఞతలు**




**మహబూబ్‌నగర్, ఆగస్టు 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
తెలంగాణ రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.116 కోట్ల బడ్జెట్ కేటాయించడం హర్షణీయమని, ఇందుకు రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరికి మహబూబ్‌నగర్ జిల్లా మత్స్యకారుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ గోనెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా గోనెల శ్రీనివాస్ మాట్లాడుతూ, మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. రూ.116 కోట్ల బడ్జెట్ కేటాయింపుతో రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులకు మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. ఈ నిర్ణయం మత్స్యకార కుటుంబాల జీవనోపాధిని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి దోమ పరమేశ్వర్, కొనగట్టుపల్లి గ్రామ మత్స్య సహకార సంఘం కార్యదర్శి బాలగోపి, బుచ్చయ్యతో పాటు పలువురు మత్స్యకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలి

**- అదనపు కలెక్టర్‌కు క్యాట్కో ఈసీ సభ్యుడు బంకల రవీందర్ విజ్ఞప్తి**

**వనపర్తి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి):**
జిల్లాలో 2019 వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్స్, విజిలెన్స్ కమిటీలను తక్షణమే ఏర్పాటు చేయాలని క్యాట్కో ఈసీ సభ్యుడు బంకల రవీందర్ కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, రవాణా, తూనికలు--కొలతల వంటి కీలక రంగాల్లో వినియోగదారులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో పనిచేసిన ఆహార సలహా సంఘాల తరహాలో ప్రస్తుతం వినియోగదారుల హక్కుల చట్టం--2019 ప్రకారం కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్స్, విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కమిటీలు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తే ప్రజల సమస్యలు నేరుగా అధికారుల దృష్టికి వెళ్లి వేగంగా పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే వినియోగదారుల సంఘాల ప్రతినిధులకు ఈ కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పిస్తే ప్రజా సమస్యలపై సమర్థవంతమైన చర్చలు జరిగే అవకాశముంటుందని అభిప్రాయపడ్డారు. పక్క రాష్ట్రాల్లో ఇప్పటికే ఇటువంటి కమిటీలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని, తెలంగాణలో కూడా వాటి ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించగా సానుకూల స్పందన లభించిందన్నారు. వనపర్తి జిల్లాలోనూ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్స్, విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరారు.



# దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

## –దళిత హక్కుల పోరాట సమితి డిమాండ్

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 03 – ప్రజా జ్యోతి**

దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద దళిత హక్కుల పోరాట సమితి నాగర్ కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కిరణ్ కుమార్ బండి లక్ష్మీపతి పాల్గొని మాట్లాడుతూ దళిత సామాజిక వర్గాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు.అంబేద్కర్ అభయహస్తం పథకంలో ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షల సంక్షేమ నిధులను వెంటనే విడుదల చేయాలని,దశాబ్దాలుగా దళితులు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములపై పరిమితులను తొలగించి,సంపూర్ణ యాజమాన్య హక్కులు (పట్టాలు) కల్పించాలని,బ్యాంకు రుణాలు,ప్రభుత్వ పథకాలు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని,రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో దళిత కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని,ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించకుండా, దళితుల విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాలకు పూర్తిగా విడుదల చేయాలని,నిరుపేద దళితులకు ఇండ్ల స్థలాలు కేటాయించి తక్షణమే పట్టాలు పంపిణీ చేసి,డప్పు కళాకారులకు అధికారిక గుర్తింపు కార్డులందజేసి, నెలకు10,000 గౌరవ వేతనం అందించాలని,స్వయం ఉపాధి,చిన్న పరిశ్రమలకు




దరఖాస్తు చేసుకున్న ఎస్సీ లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న ఇండస్ట్రియల్ రుణాల సబ్సిడీలను విడుదల చేయాలని,ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువకులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని,డిమాండ్లపై సానుకూలంగా స్పందించకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించి,అదనపు కలెక్టర్ చెన్నయ్య కు వినతి పత్రం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమితి సభ్యులు వంకేశ్వరం శ్రీనివాసులు,డి హెచ్ పి ఎస్ జిల్లా సమితి సభ్యులు కొత్త రామస్వామి,చిన్నపాగా శ్రీను,బాల పేరు,శివశంకర్,కురుమయ్య,పేరుమలి శ్రీను,దుర్గ,బండి బాలపీరు పాల్గొన్నారు.

# ప్రజల ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

## జిల్లా ఎస్పీ జానకి



**మహబూబ్‌నగర్, ఆగస్టు 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులపై వెంటనే స్పందించి చట్టబద్ధంగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి వారి సమస్యలను శ్రద్ధగా ఆలకించారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి ఫిర్యాదులపై వెంటనే విచారణ చేపట్టి చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ప్రజలకు సత్వర, పారదర్శక, నాణ్యమైన సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ జానకి తెలిపారు.

# ఆపరేషన్ ముస్కాన్-12 విజయానికి శాఖల సమిష్టి కృషి కారణం

## – విశేష సేవలందించిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేసిన అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం

**మహబూబ్‌నగర్, ఆగస్టు 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్--శ×× విజయవంతం కావడంలో పోలీసు శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో చేసిన కృషి అభినందనీయమని అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం అన్నారు.సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ఆపరేషన్ ముస్కాన్--శ××లో విశేష సేవలందించిన పోలీసు అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ), మహిళా--శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, కార్మిక శాఖ, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, జూలై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు పోలీసు శాఖతో కలిసి అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయడం వల్లే ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. బాల కార్మికత్వం, భిక్షాటన, బాల్య వివాహాలు, విద్యకు దూరమైన చిన్నారులను గుర్తించి రక్షించడంలో ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించిందని కొనియాడారు.

శాఖల మధ్య సమన్వయం, సేవా దృక్పథం, అంకితభావంతో కూడిన విధి నిర్వహణ వల్లే ఆశించిన ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సహకార స్ఫూర్తితో పనిచేసి ప్రతి చిన్నారి హక్కులను పరిరక్షిస్తూ,



వారికి సురక్షితమైన, విద్యతో కూడిన భవిష్యత్తును అందించేందుకు అన్ని శాఖలు కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ముస్కాన్--శ×× విజయానికి విశేషంగా కృషి చేసిన పోలీసు శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, మహిళా--శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, కార్మిక శాఖ, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల అధికారులు, సిబ్బందిని అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం అభినందిస్తూ, జిల్లా ఎస్పీ దరావత్ జానకి తరఫున ప్రశంసలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ నయీముద్దీన్, డబ్ల్యూపీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య, డీసీపీఓ నర్మదా, డిప్యూటీ డీఈఎంఓ డాక్టర్ శశికాంత్, కార్మిక శాఖ అధికారి బాసిత్, ఎస్ఐ లెనిన్, ఏహెచ్‌టీయూ సభ్యులు, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా వెలగొండ సర్పంచ్ శరత్ రెడ్డి

**చిన్నంబావి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండల గ్రామ సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశం అనంతరం సర్పంచులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.సంఘం అధ్యక్షుడిగా వెలగొండ గ్రామ సర్పంచ్ శరత్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా కొత్త వెంకట్ రెడ్డి, కమలాబాయి, ఉపాధ్యక్షులుగా నర్సింహ్మ, లీలావతి, ప్రధాన కార్యదర్శిగా పద్మావతి, కోశాధికారిగా శంకర్, కార్యవర్గ సభ్యురాలిగా దివ్యశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. సర్పంచులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సమస్యల పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. మండల సమగ్ర అభివృద్ధికి సర్పంచుల సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.




# చిన్నంబావిలో వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం

## తాగునీరు, పంచాయతీ భవనం సమస్యలపై అధికారులను నిలదీసిన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి: డీపీఓ

**చిన్నంబావి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్యం, పంచాయతీ భవనాలు, జలసిరి, అభివృద్ధి పనులపై సర్పంచులు అధికారులను ప్రశ్నించారు. ముఖ్యంగా అయ్యవారిపల్లి గ్రామానికి పంచాయతీ భవనం లేకపోవడంపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నాళ్లుగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నా పరిష్కారం కావడం లేదని ప్రశ్నించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.వనపర్తి జిల్లా, చిన్నంబావి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ జిల్లా మరియు జిల్లా పంచాయతీ అధికారి పి. రఘునాథ్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, కరువు పరిస్థితులను సమర్థవంతంగా




ఎదుర్కోవడానికి ప్రతి గ్రామంలో జలసిరి పనులను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో అధికారులు,సర్పంచులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని, గ్రామ పంచాయతీల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.ఎంపీడీఓ ఆదర్శ్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. పంచాయతీల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను సేకరించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.జలసిరి పనులను వేగవంతం చేయాలి:

ఏపీఓ ధనుంజయ రాజు మాట్లాడుతూ.. ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జలసిరి పనులను గ్రామాల్లో వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి రైతు పొలంలో ఫామ్ పాండ్ (పంట కుంట), ప్రతి గ్రామంలో ఊట కుంటల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నీటి సంరక్షణ పనుల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని, ప్రభుత్వ పథకాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. నీటి వనరులను సంరక్షించుకోవడం ద్వారా భవిష్యత్‌లో కరువు పరిస్థితులను ఎదుర్కొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి:తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కరువు పరిస్థితుల్లో గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని అన్నారు. రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం మండలంలో అమలవుతున్న జలసిరి పనులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, పంచాయతీ అభివృద్ధి పనులు, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై అధికారులు సమీక్షించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల మధ్య సమన్వయం కొనసాగించాలని సూచించారు.సమావేశంలో ఎంపీడీఓ ఆదర్శ్ గౌడ్, డీపీఓ, తహసీల్దార్ శ్రీనివాస్, ఏపీఓ ధనుంజయ రాజు, ఎంపీఓ రామస్వామి, మండల వ్యవసాయ అధికారి ఏవో డాకేశ్వర్ గౌడ్, లిఫ్ట్ ఇరిగేషన్ అధికారి జగదీశ్వర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

**-తల్లిపాల ప్రాధాన్యతనుపై అవగాహన కల్పించాలి**

**-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 03-ప్రజా జ్యోతి**

పోషక అభియాన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రణాళికాబద్ధంగా,సమర్థవంతంగా నిర్వహించి తల్లిపాలతో శిశువు ఆరోగ్యంపై తల్లులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.తల్లిపాల ప్రాధాన్యత,శిశు పోషణ,తల్లి ఆరోగ్యం,సమతుల్య ఆహారంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య, సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ భవనంలో జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రూపొందించిన ప్రత్యేక అవగాహన గోడపత్రికను (పోస్టర్‌ను) జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య,దేవ సహాయం, జిల్లా రెవెన్యూ అధికారి,జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ శాఖ అధికారి పాండు,కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులు,ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని,పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందించడం ద్వారా శిశువు ఆరోగ్యవంతంగా ఎదగడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని,పుట్టిన తొలి గంటలోనే తల్లిపాలు పట్టించడం ముఖ్యమని,అలాగే తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువుకు అవసరమైన పోషకాలు సహజం గానే అందుతాయని తల్లిపాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయని,తల్లిపాలివ్వడం వల్ల తల్లి ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలున్నాయని,అందువల్ల ప్రతి గర్భిణి, బాలింతకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం మహిళా శిశు సంక్షేమ,వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ,ఆశాల బాధ్యత అని స్పష్టం చేశారు.జిల్లాలో నిర్వహించే తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గ్రామాలు,మండలాలు,పట్టణ ప్రాంతాల్లోని అంగన్వాడీల్లో ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించి,ఇంటింటి ప్రచారం,అంగన్‌వాడీలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి తల్లిపాలపై ప్రజల్లో ఉన్న అపోహలను శాస్త్రీయ ఆధారాలతో తొలగించి,ప్రతితల్లి తన బిడ్డకు తల్లిపాలే ఉత్తమ ఆహారమనే సందేశాన్ని చేరవేసి పోషకాహార లోపా న్ని తగ్గించడం,శిశు మరణాలను నివారించడం, చిన్నారుల్లో రోగనిరోధక శక్తిని పెంపొందించడం వంటి లక్ష్యాల సాధనలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని,ప్రభుత్వం అమలు చేస్తున్న పోషక అభియాన్ కార్యక్రమం లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని,ప్రతి కార్యక్రమం ఫలవంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

# అధికారుల అలసత్వంపై ఎమ్మెల్యే ఫైర్

**- ప్రజల కోసం పనిచేయండి... లేదంటే చర్యలే!**

**- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ప్రతి అధికారి బాధ్యత: తూడి మేఘారెడ్డి**



**పెబ్బేరు, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి):**

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించే అధికారులను ఉపేక్షించబోమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హెచ్చరించారు. సోమవారం పెబ్బేరు మండల సర్వసభ్య సమావేశంలో శాఖల పనితీరును సమీక్షించిన ఆయన, ముఖ్యంగా ఇరిగేషన్ శాఖ అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై అవగాహన లేకుండా పనిచేసే అధికారులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ప్రతి అధికారి బాధ్యత అని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని, పాఠశాలలు, అంగన్వాడీల్లో ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

# జీతాలు చెల్లించాలని డిపిఓకు వినతి

**చిన్నంబావి ఆగస్టు 3 (ప్రజా జ్యోతి)**

గత మూడు నెలల నుండి జీతాలు చెల్లించక పోవటంతో ఉపాధి హామీ ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరే టర్లు, టెక్నికల్ అసిస్టెంట్లులు చిన్నంబావి ఎంపీడీవో కార్యాలయంలోజిల్లా పంచాయతీ అధికారి అయిన పి. రఘునాథ్ రెడ్డి. గారికి సోమవారం వినతి పత్రం అందజేశారు . ఈ సంద ర్భంగా ఏపీవో ధనుంజయ్ రాజు మాట్లాడుతూ ప్రతినెలా మొదటి తారీఖున జీతాలు పడే విధంగా ఉండాలని, పే స్కేలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగికి ఎన్ని సౌకర్యాలు ఉన్నాయో మాకు వర్తించేలా ఉండాలని, ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, ప్రమోషన్స్ లేవని, ఇంక్రి మెంట్లు లేవని, మాకు ట్రాన్స్ఫర్స్ కూడా అమలు చేయాలని చేశారు. జీతాలు సక్రమంగా రాకపోవడంతో పిల్లలను సక్రమంగా చదివించుకోలేక, ఇబ్బందులు పడుతు న్నామని, గతంలో మంత్రులు,ముఖ్యమంత్రులను కలిసి విన్నవించామని ఎవరు పట్టించుకోవటం లేదని, ఇలా పట్టించుకోకుండా ఉంటే ఆగస్టు 16 నుండి సమ్మెను ఉధృతం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ధనుంజయ రాజు, ఈసీ వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లలు మేకల గోపాల్ యాదవ్,ఈశ్వర్, స్వామి,కంప్యూటర్ ఆపరేటర్ శివయ్య, భాస్కర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



# ప్రజావాణి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

**: -జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**-142 వినతులు స్వీకరణ**

**- అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**

మహబూబ్‌నగర్, ఆగస్టు 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ): ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి అర్జిదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను ఓర్పుగా విన్న కలెక్టర్, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను పూర్తిగా అధ్యయనం చేసి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ ప్రజావాణిలో పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, వ్యవసాయం, పౌరసరఫరాలు, భూ సర్వే, గృహనిర్మాణం, రవాణా, పోలీస్, గిరిజన సంక్షమం, విద్యుత్, విద్య, వైద్య ఆరోగ్యం, మైనింగ్, అటవి, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 142 వినతులు స్వీకరించారు. ప్రజావాణి అనంతరం జిల్లా సంక్షేమ శాఖ రూపొందించిన పౌష్టికాహార అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, జడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# నవజాత శిశువుకు తల్లిపాలే రక్షణ కవచం

**చిన్నంబావి ఆగస్టు 3 (ప్రజా జ్యోతి)**

బిడ్డ పుట్టిన మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్ బి.గోవిందమ్మ సూచించారు. ఆ తర్వాత మరో ఏడాది పాటు తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలో సోమవారం బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా గోవిందమ్మ మాట్లాడుతూ.. శిశువు జన్మించిన మొదటి గంటలోపే తల్లిపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. తల్లిపాలు నవజాత శిశువును అనేక రకాల వ్యాధుల నుంచి రక్షిస్తాయని పేర్కొన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు శిశువు ఎదుగుదలకు, శారీరక--మానసిక అభివృద్ధికి అవసరమైన పోషకాలు తల్లిపాలలో సమృద్ధిగా ఉంటాయని వివరించారు.ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప ఇతర ఆహారం, నీరు, పానీయాలు ఇవ్వకూడదని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తేనె, పంచదార వంటి వాటిని బిడ్డకు పట్టించే మూఢనమ్మకాలను విడనాడాలని చెప్పారు. బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను తప్పనిసరిగా పట్టించాలని, అవి శిశువుకు వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు.

తల్లిపాలు పట్టించే విషయంలో బాలింతలకు కుటుంబ సభ్యులు సహకరించాలని, తల్లులకు సరైన అవగాహన కల్పించడం ద్వారా శిశు ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరచవచ్చని గోవిందమ్మ పేర్కొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలకు పలు సూచనలు, సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ బి గోవిందమ్మ అరుణ అంగన్‌వాడీ ఆయాలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# కొల్లాపూర్ న్యాయవాది హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష విధించాలి

**పాలమూరు బార్ అసోసియేషన్**

**మహబూబ్‌నగర్, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి బ్యూరో):**

కొల్లాపూర్‌లో న్యాయవాది మల్లయ్యపై దాడి చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పాలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌రావు డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించి, జిల్లా కోర్టు నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆనంద్‌రావు మాట్లాడుతూ, తెలంగాణలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమల్లో ఉన్నప్పటికీ న్యాయవాదులపై దాడులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని కోరారు. అవసరమైన సందర్భాల్లో న్యాయవాదులు కోరినప్పుడు వారికి ప్రత్యేక భద్రత కల్పించాలని, ఈ దాడి వెనుక ఎంతటి వ్యక్తులు ఉన్నప్పటికీ ఎవరినీ ఉపేక్షించకుండా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మృతుడు అడ్వకేట్ మల్లయ్య కుటుంబానికి ప్రభుత్వం తగిన న్యాయం చేయడంతో పాటు ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాలమూరు బార్ అసోసియేషన్ వైస్‌చైర్మన్ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి డబ్బుల నర్సింహారెడ్డి, సీనియర్ న్యాయ వాదులు చంద్రమౌళి, వెంకటేష్, బెక్కం జనార్దన్, అనంతరెడ్డి, అనిల్‌కుమార్, కమిటీ సభ్యులు ఉమా మహేశ్వరి, నేహశ్రీతో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

